
# అసంకల్పిత ప్రతీకారచర్య

టి.రాధ




'సడన్‌బ్రేకు' వెయ్యటంతో, కీచుమని శబ్దం చేస్తూ ఆగింది డీలక్స్ బస్సు. ఏమరుపాటుగా వున్నానేమో, ఎదురుగా వున్న యినుప కమ్మీకి తల గుద్దుకుంది. 'అబ్బా' అని తల తడుముకుంటూ ముందుకు చూశాను.

'ముల్కీ డౌన్! డౌన్!

...డౌన్! డౌన్!

...కాలేజి జిందాబాద్!'

నలభైమందుంటారు. ఎవరికీ ఇరవై దాటవు. కుర్రతనం! వెర్రి ఆవేశం! చెవులు గిళ్లుపడుతున్నాయి.

'చెయ్యండి ముల్కీ రూల్స్ చిత్తు, లేదా మాకొద్దు తెలంగాణా పొత్తు'— పోస్టరు డ్రయివరు ముందున్న అద్దం మీదంటించబోయాడొక గుస్సాపి! డ్రయివరు కెవ్వుమన్నాడు, బతిమిలాడి ప్రక్కనంటింపా చేశాడు.

స్టూడెంటు లీడరు ముందుకొచ్చాడు. సన్నంగా రివటలా, బెల్‌బాటం ప్యాంటుతో చాలా తమాషాగా వున్నాడు.

'కండక్టర్! మేం బస్సులో ఎక్కుతాం. అనకాపల్లి వెళ్లాలి''

'మీరంతానా?!' కండక్టరు నోరెళ్ళబెట్టాడు.

'అవును.'

'చూస్తున్నారుగా, ఖాళీ లేదు స్టాండింగ్ పాసింజర్సు ఎక్కించుకో కూడదు.'

ప్రయాణీకులంతా వింతగా చూస్తున్నారు.

'మేం అనకాపల్లి వెళ్ళితీరాలి.'

'రూల్స్ ఒప్పుకోవు. ఇంకో బస్సుకోసం వెయిట్ చెయ్యండి.'

'ప్యాసింజర్సు దగ్గర అన్యాయంగా డబ్బులు కొట్టేసేటప్పుడుంటాయా యేం రూల్సు'—ఎవరో అరిచారు.

కండక్టరులో రోషం మొలకెత్తింది. 'మాటలు జాగ్రత్తగా రానివ్వండి' అన్నాడు,

'వాణ్ని నాలుగు వత్తయ్యండి!'—కేకలు; స్టూడెంట్సు ముందుకురుకుతున్నారు.

'ఆగండి!' అరిచాడు లీడరు. ప్రవాహం ఆగింది. 'కండక్టర్నేమి చెయ్యొద్దు! మన నిర్ణయం జ్ఞాపకముందిగా! ఒకం తర్వాత

ఒకరు బస్సు ఎక్కండి.'

'పిరికి మందు!' అడ్డంగా నుంచున్నాడు కండక్టరు వెల్లువలో పూచికపుల్ల! అందరూ బస్సు ఎక్కారు.

డ్రయివరు యిక తప్పదని బస్సు ముందుకు దూకించాడు. కండక్టరు నీరసంగా సీటులో కూలబడ్డాడు.

బస్సులో కేకలు, వివాదాలు. చెవులు హోరెత్తుతున్నాయి. ఒక స్టూడెంటు నాదగ్గరి పత్రిక తీసుకున్నాడు. పత్రిక తిరగేస్తున్న వాడల్లా టక్కున ఆగి 'వినండోయ్!' అని పత్రిక అందరికీ కనబడేలా పట్టుకుని 'ముల్కీ రూల్సు న్యాయసమ్మతమే!' అని బిగ్గర చదివాడు.

ఒకమూలనుంచి—'ఏవ్రడా ... కొడుకు వ్రాసింది?'

ఇంకో ప్రక్కనుంచి—'చింపే యండ్రా!'

పేజీ 'పర్రు'మని చిరిగిపోయింది. నావేపు తిరిగి 'సారీ' అన్నాడు. లోపల మండుతున్నా, ఏమీ అనే ధైర్యంలేక ఒక వెర్రి నవ్వు నవ్వి 'పర్వాలేద'న్నాను.

బస్సు యీ గొడవ తనకేమీ పట్టనట్లు ముందుకు దూసుకుపోతుంది. ఒక స్టూడెంటు యీలపాట పాడుతున్నాడు. ఆ ప్రక్కనే ఓ కొత్తగా పెళ్ళయిన అమ్మాయుంది. ఆ అమ్మాయి భర్త కిటికీవయిపు కూర్చున్నవాడల్లా లేచి, ఆమెను కిటికీ వయిపు కూర్చోమని, తను స్టూడెంటు వయిపు కూర్చున్నాడు.

'ఏవిటీ బస్సురాజము ఒంటెద్దుబండి చందంబున పోవుచున్నది'—ఒకరి కామెంటు.

'డ్రయివర్! స్పీడుగా పోనియ్! పేరుకు డీలక్స్, వెళ్ళేది ఎద్దుబండిలా వుంటే ఎలాగోయ్?'—ఇంకొకరి మందలింపు.

డ్రయివరు రెక్కలు విరిగిన పక్షిలా పళ్ళు నూరుకుని, యాక్సిలేటరు గట్టిగా కాలితో నొక్కాడు. చక్రాలు గాలితో పోట్లాడుతున్నాయి.

'డ్రయివర్‌కు రోషమొచ్చిందే!'

'అది డ్రయివరు ప్రతాపం కాదురా బాబు. ఇందాక సంచలో కొన్న విద్యాజల ముందు కక్కేస్తేను'

గొల్లున నవ్వులు

'అబ్బాయీ!' లీడర్ని సంబోధిస్తూ అడిగారో తాతగారు 'సక్రమంగా చదువుకోక యీ గొడవలన్నీ ఏనికయ్యా మీకు?'

'చదువుకుని...?' ఎదురుప్రశ్న వేశాడు లీడరు,

'చదువుకు స్వస్తిచెప్పి, యీ గొడవతో ఏమి సాధిస్తారు మీరు?'

'మీరే చూస్తారుగా, ఇంకాస్సేపట్లో యీ బస్సు తగులబెట్టబోతున్నాం.'

బస్సులో ప్రయాణీకులందరం తెల్లబోయ్యాము. తేరుకుని అడిగారు తాతగారు. 'బస్సు తగులబెడితే ముల్కీ రూల్సు రద్దవుతాయా?' — వ్యంగ్యం సంధించిన బాణం లాగుంది ప్రశ్న వెనుక.

'మీరు బయాలజీలో 'అసంకల్పిత ప్రతీకార చర్య' గురించి చదివారనుకుంటాను. గాఢనిద్రలో వున్నవాడ్నయినా సూదితో గుచ్చితే, వెంటనే రియాక్షను చూపిస్తాడు.'

'దానికి యీ బస్సు తగలబెట్టటానికి సంబంధం?'

'ఆలోచించండి; తెలుస్తుంది.'

నేనన్నాను—'మృదువుగా, మంచిగా తట్టి లేపవచ్చుగా. సూదులతో, బాకులతో గుచ్చటం దేనికి.'

లీడరు ఎంత అమాయకురాలివి అన్నట్లు నవ్వాడు నావేపు చూసి. విద్యార్థులందరి కళ్ళూ నావేపు తిరిగాయి.

'పొట్టి శ్రీరాములుగారు ఎంతో శాంతంగా, మంచిగా మేల్కొల్పటానికి ప్రయత్నించారు. ఫలితం! ఆయన మరణించిన వరకు కళ్ళు తెరవలేదీ ప్రభుత్వం' మేడం! శాంతియుతంగా పనులు సమకూరవు భారతావనిలో.'

'ప్రభూ! అనకాపల్లి వచ్చేస్తుంది.' ఎవరో వెనకాల్నుంచి అరిచారు.

లీడరు 'డ్రయివర్! బస్సాపు' అనరిచాడు. బస్సాగింది. లీడరు ప్రయాణీకుల నుద్దేశిస్తూ గంభీరంగా 'దయచేసి మీరంతా బస్సు దిగండి. మిమ్మల్నందర్నీ వేరే బస్సులో పంపించే భారం మాది. యీ బస్సు తగులబెట్టబోతున్నాం!' అన్నాడు.

ఒక సీట్లోంచి నడివయస్సాయన లేచి, లీడరువద్దకొచ్చి చేతులు పట్టుకుని 'మా అమ్మాయిని పురిటికి తీసుకెళ్ళుతున్నాను. నెలలు నిండాయి. ఏ క్షణాన్నయినా కాన్పు రావచ్చు. నామీద దయుంచి బస్సు ముందుకు పోనివ్వండి' అన్నాడు.

'క్షమించాలి! ఒకసారేదయినా నిర్ణయం తీసుకుంటే ఏదేమయినా అమలు జరిపే మనస్తత్వం నాది. నెల్లాయిమీద నాకూ సానుభూతి వుంది. ఇంకేదయినా బస్సుకాని, లారీకాని వస్తుంది, దయచేసి దిగండి! అందరూ త్వరగా దిగాలి!'

స్టూడెంట్సు సామాన్లు దింపేస్తున్నారు. గత్యంతరంలేక ప్రయాణీకులు ఒక్కొక్కరే దిగుతున్నారు ఎవరూ ఏమీ అనలేని మనస్థితి! అందరూ కలిసినా ఏమీ చెయ్యలేని పరిస్థితి!

డ్రయివరూ, కండక్టరూ యిక తమ చేతుల్లో ఏమీ లేనట్టు చెట్టుక్రింద నుంచుని నిర్వికారంగా బీడీలు కాలుస్తున్నారు. ప్రయాణీకులు ఎవరి సామాన్లు వాళ్ళు చెట్టుక్రిందకు చేరవేస్తున్నారు.

పురిటాలు నొప్పులు పడుతుంది. తండ్రి కంగారు పడుతున్నాడు. నలుగురు స్త్రీలు కలిసి చెట్టుక్రిందే మరుగేర్పరిచారు. మరుగున నొప్పులు! దెబ్బున కేకలు! ఒకరికి జన్మ యిచ్చేందుకు మరొకరు బ్రతుకుతో సలిపే పోరాటం! కడుపులో శిశువు బయట ప్రపంచం చూడాలని ఆరాటం!

పెట్రోలు డబ్బాలు పైకి లేచాయి. బస్సుమీద పెట్రోలు వర్షం! 'అందరూ దూరంగా వెళ్ళండి!' అగ్గిపెట్టె చేత్తోకి తీసుకుని హెచ్చరించాడు లీడరు.

అగ్గిపుల్ల వెలిగింది!

'భగ్! భగ్!' మంటలు.

హృదయ విదారకమయిన లీడరు కేకలు

భగ, భగ మండుతుంది బస్సు!

భగ, భగ మండుతున్నాయి బస్సు తడిపే ప్రయత్నంలో తడిసిన లీడరు దుస్తులు

అందరూ తెల్లబోయారు.

అగ్ని ముల్కీలా వున్నాడు. నాన్ ముల్కీ ఒంటిమీద పాకుతున్నాడు...కాలుస్తున్నాడు. మసిచేసే యత్నంలో వున్నాడు. చుట్టుప్రక్కల నీళ్ళుకాని, ఇసుకకాని లేదు. అందరూ కంగారుగా ఎవరిచేతి కందిన మట్టి వాళ్ళు లీడరుమీద జల్లారు

మట్టి అడుగున నాన్ ముల్కీ శవం!

గుప్పెట్ల వెనుక ఇంకా కళ్ళుతెరవని నాన్ ముల్కీ ఏడ్పు!

మండి మండి బస్సు నిదానంగా మింటికెగసే జ్వాలలు!

చెంపలమీదుగా జారుతున్న కన్నీటిని తుడుచుకున్నాను. మసక, మసకగా కన్నీటి పొరలనుంచి ఇంకా పూర్తిగా చల్లారని లీడరు శవం నన్నేదో ప్రశ్నిస్తుంది.